సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



కనకమ్మకు సహస్ర తులసిపూజ

విశాఖ నగరం బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు.



విద్యార్థుల మెస్ పరిశీలన

విశాఖ: ఏయూ ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌ను రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు.

సొంతిల్లు.. ఆనందాల హరివిల్లు

చెప్పలేనంత సంతోషం



నా భర్త ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ వర్కర్. ఆ ఆదాయంతో కుటుంబం గడవడమే గగనం. అలాంటి మాకు సీఎం జగన్ దయతో సొంతింటి కల నెరవేరింది. ఓ ఆసరా లభించింది. ఎంత ఆనందంగా ఉందో.. చెప్పేందుకు మాటలు చాలడం లేదు.. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం అని చెప్పడం తప్ప. ఇక్కడి వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది.

–మేడిశెట్టి లక్ష్మి

పేదింటికి పండగొచ్చింది

- అంగరంగ వైభవంగా సామూహిక గృహప్రవేశాలు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్
- వెన్నెలపాలెంలో 174 గృహాల్లో ప్రవేశించిన లబ్ధిదారులు

సాక్షి, అనకాపల్లి: ఇల్లు కట్టుకోవాలన్నది ప్రతి ఒక్కరి కల. స్థోమత ఉన్నవారికి సరే గానీ సామాన్యులకు అది అందని ద్రాక్షే. వారి ఆశలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞంలా చేపట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు' పథకం పేదల బతుకుల్లో వెలుగు తీసుకొచ్చింది. స్వప్నం సాకారం చేస్తూ వారిని ఓ ఇంటి వారిని చేసింది. గురువారం రాష్ట్రమంతటా అంగరంగ వైభవంగా సామూహిక గృహోత్సవాలు జరిగాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జగనన్న కాలనీలను ప్రారంభించారు. పరవాడ మండలం వెన్నెలపాలెంలో పరవాడ–1 లేఅవుట్ కూడా అందులో ఒకటి. ఈ కాలనీలో గల 174 గృహాలను ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్, హౌసింగ్ పీడీ రమామణి ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణల మధ్య లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమ సుందర్‌రావు, ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ, వెన్నెలపాలెం సర్పంచ్‌లు సీహెచ్ అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, గృహనిర్మాణ శాఖ డీఈ ప్రసాద్, ఏఈ ఎం.ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెన్నెలపాలెం జగనన్న కాలనీ స్వాగత ద్వారం



జగనన్న కాలనీని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, హౌసింగ్ పీడీ రమామణి

174 ఇళ్లలో గృహప్రవేశం

పరవాడ మండలంలో 8 జగనన్న లేఅవుట్లలో 871 ఇళ్లు మంజూరు కాగా..వాటిలో 360 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో పరవాడ–1 లేఅవుట్ పరిధిలోని పరవాడ, వెన్నెలపాలెంలో 290 ఇళ్లు పూర్తి కాగా అందులో 174 ఇళ్లను గురువారం ప్రారంభించారు. వెన్నెలపాలెం లేఅవుట్‌లోని లబ్ధిదారులకు రూ.3.60 కోట్లు పంపిణీ చేశారు. కల్వర్ట్, డ్రెయిన్‌ల కోసం రూ.25 లక్షలు, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, స్వాగత తోరణానికి రూ.6.05 లక్షలు ఖర్చు చేశారు. అంతేకాకుండా 290 లబ్ధిదారులకు రూ.55 లక్షల రుణాలు మంజూరు చేశారు.

జిల్లాలో 34,394 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

అర్హులైన ప్రతీ పేదవానికి పక్కా గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా..'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు'లో భాగంగా అనకాపల్లి జిల్లాకు 68,466 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 682 లేఅవుట్లలో చేపట్టిన 34,394 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో మంజూరైన మొత్తం 68,466 ఇళ్లలో వైఎస్సార్ గృహ నిర్మాణంలో 62,954 ఇళ్లు కాగా టిడ్కో ఇళ్లు 5,512 ఉన్నాయి. పీఎంఏవై స్కీంలో భాగంగా 4,383 ఇళ్లను స్వంత స్థలంలో లబ్ధిదారుకు మంజూరు చేశారు. ప్రతీ ఇంటికీ రూ.1.80 లక్షల చొప్పున పూర్తి సబ్సిడీతో రూ.1054 కోట్లు నిధులు కేటాయించారు.

కల నెరవేరింది

పరవాడ: పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పరవాడ–వెన్నెలపాలెంలో బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ల కాలనీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలకు శాశ్వత నివాసం కల్పించే ఒక గొప్ప కార్యక్రమాన్ని అమలు చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో పేద ప్రజలకిచ్చిన హామీని జగనన్న నిజం చేశారన్నారు.

ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ రోజు పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. సొంతింటి కల నెరవేరడంతో మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. స్థలం సమకూర్చి సకల సదుపాయాలతో సొంతింటి కలను నిజం చేయడంతో వారి కళ్లల్లో ఆనందం తాండవిస్తుందన్నారు. కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో నివాసానికి ఎంతో యోగ్యంగా ఉన్నాయన్నారు.

తరతరాలూ గుర్తుపెట్టుకుంటాం



ఓ ప్రవేట్ ట్రాన్స్‌పోర్టులో చిన్న ఉద్యోగంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. సొంతిల్లు అనే ఆలోచన కలలో కూడా అనుకోలేని బతుకులు. అలాంటి మమ్మల్ని సొంతింటికి యజమానుల్ని చేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడిపోయాం. స్థలంతోపాటు, ఇల్లు కట్టుకునేందుకు రుణం కూడా ఇచ్చారు. మా కుటుంబం తరతరాలూ గుర్తుపెట్టుకుంది.

– రొంగలి ఆదిలక్ష్మి

మౌలిక వసతులు బాగున్నాయి



జగనన్న కాలనీలో ప్రభుత్వం ఉచితంగా తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసింది. కాలువలు, రోడ్లను ఏర్పాటు చేసింది. లబ్ధిదారులు కుటుంబాల సహా, ఆనందంగా ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. జగనన్నకు రుణపడిపోయాం.

-ఆర్.రాధ

పేదల పాలిట దేవుడు జగనన్న



బడుగు బలహీన వర్గాల ప్రజల కష్ట సుఖాలు తెలిసిన దేవుడు జగనన్న. నిజమైన పేదలను గుర్తించి వారికి అండగా నిలిచిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. మా కుటుంబానికి నిలువ నీడ కల్పించిన సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది. సొంతింటిని మంజూరు చేసి, ఆర్థిక భరోసా కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు.

-వి.మదాలస

న్యూస్‌రీల్

లడ్డూ ధర రూ.2.22 లక్షలు





30 అడుగుల వినాయక విగ్రహాన్ని ఉన్నచోటే నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్ లడ్డూ)

రావికమతం: మండలంలోని గొంప, కొత్తకోట, మేడివాడ గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. కొత్తకోట గ్రామంలో 30 అడుగుల భారీ గణనాథుడిని ఆ స్థానంలోనే మోటార్లతో నీటిని చిమ్మి నిమజ్జనం చేశారు. అక్కడ వేలంలో లడ్డూ ఏకంగా రూ.2 లక్షల 22 వేలు పలికింది. అనకాపల్లి ఎంవీఆర్ ఫౌండేషన్ అధినేత ముత్యాల వెంకట రమణ కుమారుడు సతీష్, పలువురు వ్యాపారులు లడ్డూ వేలంలో పాల్గొన్నారు. చివరికి కమిటీ సభ్యులు 10 మంది కలిసి లడ్డూను దక్కించుకున్నారు. గొంప గ్రామంలోనూ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కళాకారిణి కవిత ప్రదర్శన ఆకట్టుకుంది.

సీఎంను స్వాగతిస్తున్నాం



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ప్రసాద్‌నాయుడు

మాకవరపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దసరా నుంచి విశాఖ నుంచే పాలన సాగించడాన్ని స్వాగతిస్తున్నామని ఆల్ ఇండియా జ్యోతీబాపూలే ఓబీసీ అధ్యక్షుడు పోతల ప్రసాద్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం విశాఖ రావాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలనా రాజధాని కాబోతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల నుంచి స్వాగత ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మహిళా బిల్లు, ఓబీసీ బిల్లులకు రాష్ట్రంలో 22 మంది ఎంపీలు పార్లమెంట్‌లో మద్దతు తెలపడంపై ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు.

రేపు నునపర్తిలో బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

అచ్యుతాపురం (అనకాపల్లి): ఈ నెల 14న అచ్యుతాపురం మండలం నునపర్తిలో అండర్ 19 బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నర్సింహనాయుడు తెలిపారు. శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా మైదానంలో ఎంపిక జరుగుతుందన్నారు. 2001 జనవరి 2 తర్వాత జన్మించిన విద్యార్థులు ఈ సెలక్షన్లలో పాల్గొనవచ్చని సూచించారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం: స్టేట్ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కోర్టులో కక్షిదారుల తరుపున దాఖలు చేసే పిటిషన్లపై రూ.20 స్టాంప్ అతికించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఏపీలో అమలు చేయటం సరికాదన్నారు. కక్షిదారుల తరుపున పిటిషన్లు దాఖలు చేయాల్సివచ్చినప్పుడు రూ.1 నుంచి రూ.2 స్టాంప్‌లు ఉపయోగించేవారమన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ ఇటంశెట్టి సూరిబాబు, సీనియర్ న్యాయవాదులు కామిరెడ్డి సత్యనారాయణ, అనిమిరెడ్డి గోవింద్, ఎస్.కె.నాయుడు, సింగంపల్లి రామలక్ష్మి, వాసవీ దత్త పాల్గొన్నారు.

బీచ్ ఐటీ డెస్టినేషన్‌ను ప్రమోట్ చేస్తున్నాం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి



ఇన్ఫోసిస్ కార్యాలయం



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ఐటీ అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ విశాఖలో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి అమర్‌నాథ్, సందర్శించారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ డా.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ డా.సాయికాంత్‌వర్మ, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఐటీ సెజ్ హిల్ నం.2లో 16న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని సీఎం జగన్ ప్రారంభించి కంపెనీ ఉద్యోగులతో మాట్లాడతారని చెప్పారు. విశాఖలో ఐటీ సంస్థల్ని ఆకర్షించేందుకు బీచ్ ఐటీ డెస్టినేషన్‌ని ప్రమోట్ చేస్తున్నామన్నారు. 1,000 మందితో ప్రారంభించి 3,000 మంది వరకు ఉద్యోగుల సంఖ్యని పెంచేదిశగా ఇన్ఫోసిస్ సంస్థ పయనించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రభుత్వం తరపున కావాల్సిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ రాకతో.. మిగిలిన పెద్ద సంస్థలన్నీ విశాఖలో తమ శాఖల్ని విస్తరింపజేసే ఆలోచనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సాధించిందని, దానికి దీటుగా విశాఖ నగరాన్ని కూడా ఈ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ఇన్ఫోసిస్ కంపెనీలలో విశాఖకు చెందిన నాలుగు నుంచి ఐదు వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వారిని విశాఖ కార్యాలయానికి బదిలీ చేస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని ఇన్ఫోసిస్ యాజమాన్యం భావిస్తోందన్నారు. హిల్ నెం.2లో జరుగుతోన్న హెలిప్యాడ్ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.

వీరభద్రుడి స్థలానికి విముక్తి

- కర్రల డిపో తొలగించాలని అధికారుల ఆదేశం
- వాహనాలపై కర్రల తరలింపు ప్రారంభం



వీరభద్రస్వామి ఆలయ స్థలంలో ఉన్న కర్రల డిపోను పరిశీలిస్తున్న దేవదాయ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణ నడిబొడ్డున వున్న వీరభద్రస్వామి ఆలయ భూముల పరిరక్షణకు దేవదాయశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. పట్టణంలో సర్వే నెం.164లో ఉన్న వీరభద్రస్వామి ఆలయానికి చెందిన రూ.4 కోట్ల విలువైన స్థలంలో కర్రల డిపో పేరిట ఆక్రమణపై 'వీరభద్రుడి భూములకు దిక్కేది?' శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. తక్షణమే ఆ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ జిల్లా దేవదాయ అధికారి ఎస్.రాజారావు స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం యలమంచిలి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఆలయ ఈవో టి.సాంబశివరావు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కర్రల డిపో, ఇతర సామగ్రి ఉండటాన్ని గుర్తించారు. తక్షణమే ఖాళీ చేయకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి ఆలయ స్థలంలో ఉన్న కర్రల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన ఆక్రమణలను కూడా దశల వారీగా తొలగించేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు సాక్షికి తెలిపారు. ఇకపై ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నిఘా పెట్టనున్నట్లు ఈవో సాంబశివరావు చెప్పారు. సాక్షి కథనం వల్లే ఆలయ భూముల ఆక్రమణకు అడ్డుకట్ట పడిందని స్థానికులు, భక్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

మూడు నెలల బాలుడు మృతి

- వ్యాక్సిన్ వికటించడమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



మృతి చెందిన బాలుడు దీక్షితారాం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బుచ్చెయ్యపేట: ఐతంపూడికి చెందిన మూడు నెలల బాలుడు దీక్షితారాం వ్యాక్సిన్ వేసిన మర్నాడు అస్వస్థతతో మృతి చెందాడు. వ్యాక్సిన్ వికటించడమే కారణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐతంపూడికి చెందిన ఐయితరెడ్డి సతీష్, ధనలక్ష్మిల రెండో కుమారుడు దీక్షితారాంకు మూడో నెల రొటీన్ వ్యాక్సిన్‌ను బుధవారం బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వేయించారు. గురువారం దీక్షితారాం ఆరోగ్యం బాగుండకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక ఏఎన్ఎంకు ఫోన్ చేయగా ఆమె ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విధుల్లో ఉండి సకాలంలో వెళ్లలేకపోయారు. దీంతో వారు బాబును రావికమతం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అంతలోనే బాబు మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బాలుడు వ్యాక్సిన్ వికటించి మృతి చెందాడని వారు కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు కె.వి.కృష్ణను వివరణ కోరగా బుధవారం 15 మంది పిల్లలకు ఇదే రొటీన్ వ్యాక్సిన్ వేశామని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు. బాబు మృతి చెందిన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసికెళ్లామన్నారు.

15 నుంచి సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు



సింహాచలం: సింహగిరిపై ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉత్సవాల సమయంలో స్వామి సన్నిధిలో ప్రతీ రోజూ రామాయణ పారాయణ విన్నపం, చతుర్భుజ తాయారు, అమ్మవార్లకు బేడా తిరువీధి ఉంటుందన్నారు. 19 నుంచి 23వ తేదీ వరకు సింహవల్లీ తాయారు సన్నిధిలో వీరలక్ష్మీ అరాధన, త్రిరాత్రి వ్రతం(మూలపూజలు), ఆయుధ పూజలు జరుగుతాయన్నారు. 24న విజయదశమిని పురస్కరించుకుని సాయంత్రం కొండదిగువ ఉద్యానవనం(పూలతోట)లో జమ్మివేట ఉత్సవం, శమీపూజ నిర్వహిస్తామన్నారు. విజయదశమి రోజు సాయంత్రం సింహగిరిపై స్వామివారి దర్శనాలు 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని తెలిపారు.

ఎస్ఐ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు

- 14, 15 తేదీల్లో 19 కేంద్రాల్లో పరీక్ష

దొండపర్తి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో జరగనున్న సబ్ ఇన్‌స్పెక్టర్(సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏపీఎస్పీ) అభ్యర్థుల మెయిన్స్ రాత పరీక్షలకు విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో 19 పరీక్షా కేంద్రాల్లో ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్–2 పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు పురుషులు 9,913 మంది, మహిళలు 1,452 మంది మొత్తంగా 11,365 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

అభ్యర్థులకు నిబంధనలు

- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ఒక గంట ముందుగా హాజరుకావాలి.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుంది.
- పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రదేశాన్ని ముందగానే గూగుల్ సెర్చ్ చేసుకొని లేదా ముందుగానే సందర్శించి పూర్తిగా అవగాహన చేసుకొని పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి.
- అభ్యర్థులు బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి.
- నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు(సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, బ్యాగ్‌లు, బ్లూటూత్ వంటివి) అనుమతి ఉండదు.
- అభ్యర్థులు వారి వెంట తెచ్చుకొనే విలువైన సామగ్రిని వారే భద్రపరచుకోవాలి.
- పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఎటువంటి లౌడ్ స్పీకర్స్, మైకులు అనుమతించరు.
- పరీక్షా కేంద్రం వద్ద జెరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోలు పరీక్షా సమయంలో మూసివేయాలి.
- కేంద్రం వద్ద 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుంది. దీంతో ప్రజలు గుంపులుగా ఉండకూడదు.
- బందోబస్తు నిర్వర్తించే సమయంలో పోలీసులకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.
- ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మోసపూరిత మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ సూచించారు.
- అటువంటి వారి గురించి తెలిస్తే డయల్ 112కు గాని, దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో గాని సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.
- ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని స్పష్టం చేశారు.

ఏయూను సందర్శించిన హెల్త్ వర్సిటీ వీసీ



హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీని సత్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ కె.బాబ్జీ గురువారం సాయంత్రం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ప్రసాదరెడ్డి ఆయనకు తెలియజేశారు. ఏయూలో మౌలిక వసతుల అభివృద్ధి, భవనాలను ఆధునికీకరించిన విధానాన్ని వివరించారు. ఏయూ తరపున డాక్టర్ బాబ్జీని ఆచార్య ప్రసాదరెడ్డి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులను www. visakhapatnam.nic.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత జెరాక్స్ ప్రతులను జతచేసి ఈ నెల 20వ తేదీలోగా ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో అందించాలని సూపరింటెండెంట్ సూచించారు.

ఊరూరా ఆరోగ్య భాగ్యం

నిరుపేదల పాలిట సంజీవిని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ఊరూరా స్పందన లభిస్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులు ఆయా శిబిరాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.


దేవరాపల్లి మండలం మారేపల్లి జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో సేవలపై వైద్య సిబ్బందిని ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్


మారేపల్లిలో వీల్ చైర్‌లో వృద్ధుడిని వైద్య శిబిరానికి తీసుకువస్తున్న వలంటీర్


ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన విద్యార్థినులు


చీడికాడ మండలం బైలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వెదురుపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చిన్నారి పల్లా జశ్వంత్‌కు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఆ కాలేజీలకు షాక్

- అనుమతులు ఒక చోట, కాలేజీల నిర్వహణ మరో చోట
- ఇంటర్మీడియెట్ బోర్డు అధికారుల తనిఖీలతో వెలుగులోకి..
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 7 కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీ
- ఒక్కో కాలేజీ యాజమాన్యానికి రూ.2.5 లక్షలు చొప్పున జరిమానా
- అకాడమీల పేరుతో అనుమతులు లేకుండానే కాలేజీల నిర్వహణ

విశాఖ విద్య: ఎండాడలో కాలేజీ నిర్వహణ కోసమని అనుమతులు తీసుకున్న ఎస్ఆర్ఐ యాజమాన్యం, అక్కడ కాకుండా బోయపాలెంకు దర్జాగా తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా రెసిడెన్షియల్ కాలేజీ నడిపిస్తున్నారు. తనిఖీలకు వెళ్లిన ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఈ తతంగాన్ని చూసి అవాక్కయ్యారు. ఒక చోట అనుమతులు తీసుకొని, మరో చోట కాలేజీ నిర్వహించటంపై తీవ్రంగా పరిగణిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాలేజీ యాజమాన్యానికి రూ.2.50 లక్షలు జరిమానా విధించారు.

● ఇంటర్మీడియెట్ బోర్డు వద్ద ఉన్న అనుమతుల మేరకు నవోదయ జూనియర్ కాలేజీ పెందుర్తిలో నిర్వహించాలి. కానీ కాలేజీ మరో చోటకు షిఫ్ట్ చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు, సదరు యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసి, రూ.2.50 లక్షలు జరిమానా విధించారు. తదుపరి చర్యలకు రెండోసారి కూడా నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రైవేటు యాజమాన్యాల విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేసేలా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఏడు జూనియర్ కాలేజీలను గుర్తించి, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతే కాకుండా ఒక్కో కాలేజీ యాజమాన్యానికి రూ. 2.50 లక్షలు చొప్పున జరిమానా విధించారు. తనిఖీల ప్రక్రియ ఇంకా కొనసాగుతుం డటంతో, ఇలాంటి కాలేజీలు ఇంకెన్ని బయటపడతాయోనని విద్యాశాఖ వర్గాలు, కాలేజీ యాజమాన్యాల్లో సర్వత్రా చర్చసాగుతోంది.

అకాడమీల పేరుతో ఫీజుల దోపిడీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో 360 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 21 కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టడం లేదు. మిగతా కాలేజీలో ఏటా ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం కలిపి 1.10 లక్షల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో 246 కాలేజీలు ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోనే ఉన్నాయి. రెసిడెన్షియల్ కాలేజీలు నిర్వహిస్తుండటంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సైతం విద్యార్థులు విశాఖ నగరంలోని కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. విద్యార్థుల డిమాండ్‌తో కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు కొత్త ఎత్తుగడలు వేస్తున్నాయి. వివిధ ఎంట్రన్స్ పరీక్షల శిక్షణ పేరుతో ఎటువంటి అనుమతుల్లేకుండానే అకాడమి, కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, లక్షలాది రూపాయలను ఫీజుగా వసూలు చేస్తున్నారు. ఇలాంటి వాటిపై ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు దృష్టి సారించి, తనిఖీలు ముమ్మరం చేశారు.

ఆ విద్యార్థులకు అడ్మిషన్లు ఎక్కడ

గురుద్వారా వద్ద నీట్, ఐఐటీ, జేఈఈ, క్లాట్, సీఏ పేరుతో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో 2 వందల మందికి పైగానే విద్యార్థులు ఉన్నారు. వీరిని నగరంలోని వేర్వేరు కాలేజీల్లో అడ్మిషన్లు ఇచ్చి, ఇక్కడనే రోజంతా తరగతులు నిర్వహిస్తుండటం గమనార్హం. రెగ్యులర్‌గా కాలేజీలకు వెళ్లి, 75 శాతం మేర హాజరు ఉన్న వారికే అమ్మ ఒడి పథకానికి అర్హులు. అలాంటప్పుడు, కోచింగ్ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు అడ్మిషన్లు ఎక్కడ ఇస్తున్నారనేది అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది. అదే విధంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే కాలేజీల ప్రాంగణాల్లోనే వసతి గృహాలు నిర్వహిస్తున్నారు.


ఓ ప్రైవేటు కాలేజీలోని ల్యాబ్‌లను పరిశీలిస్తున్న ఆర్ఐవో సత్యనారాయణ

కఠినంగానే వ్యవహరిస్తాం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ప్రైవేటు కాలేజీలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు కాలేజీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమే. బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అకాడమీలపై కూడా దృష్టి సారించాం. అనుమతులు లేని వాటిని మూసివేస్తాం.

–రాయల సత్యనారాయణ, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, విశాఖపట్నం

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

చోడవరం : జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జాతీయ స్థాయి క్యోరిగి, పూమ్‌సే తైక్వాండో పోటీలు జరిగాయని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి గురువారం చెప్పారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని ఆయన తెలిపారు. ఎం.హేమశ్రీ (రజత, కాంస్య), గండి కారుణ్య సందీప్ (రజత, కాంస్య) పతకాలు సాధించారన్నారు. అదే విధంగా సబ్ జూనియర్ పూమ్‌సేలో తన్విత్ ఉదయ్ (రజత, కాంస్య), శశివర్ధన్ కుమార్, ఎస్.సరూర్, ఆర్.దీక్షితులు కాంస్య పతకాలు సాధించారని మురళి తెలిపారు. వీరందరినీ అసోసియేషన్ అభినందించింది.

క్లుప్తంగా

మరిడిమాంబ గుడి హుండీలో నగదు చోరీ


హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

బుచ్చెయ్యపేట : రాజాం మరిడిమాంబ గుడి హుండీలో నగదును దొంగలు దోచుకున్నారు. గురువారం తెల్లవారుజామున హుండీ పగలగొట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై రాజాం సర్పంచ్ మరిసా నాని బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి క్లూస్ టీంను రప్పించి విచారణ చేస్తున్నారు. రాజాం, తైపురం, నీలకంఠాపురం, చిట్టియ్యపాలెం గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా మరిడిమాంబను కొలుస్తారు. హుండీలో రూ. 15 వేలకుపైగా నగదు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్ఐ తమ సిబ్బందితో విచారణ చేస్తున్నారు.

28న మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనం

సింహాచలం : ఈనెల 28న చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు పునరుద్ధరిస్తామన్నారు. 28వ తేదీ రాత్రి ఆరాధన, 29న ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వర్ణపుష్పార్చన, గరుడసేవలు రద్దుచేసినట్లు పేర్కొన్నారు.

చిట్టి చేతులు.. పెద్ద సాయం

రావికమతం : వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర అనారోగ్యంతో మంచంపై ఉన్న కొత్తకోట పడమటి శ్రీనివాసరావు అనే ప్రైవేటు టీచర్‌కు కొత్తకోట హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. శ్రీనివాసరావు ప్రమాదంలో గాయపడి మంచంపై ఉండడం, అతని తల్లి గుండె సంబంధ వ్యాధితో మరో మంచంపై ఉండడంతో తండ్రి వెంకటరావు వారికి సపర్యలు చేస్తున్నాడు. వెంకటరావు కొత్తకోట హైస్కూల్ వద్ద చాక్లెట్లు, బఠానీలు అమ్ముతూ విద్యార్థులకు బిళ్లల తాతగా పరిచయం అయ్యాడు. కొన్నాళ్లుగా హైస్కూల్‌కు మిఠాయిలు తేకపోవడం, కన్పించక పోవడంతో విషయం తెలుసుకున్న ఆ స్కూల్ విద్యార్థులు సుమారు 498 మంది తోచిన సహాయాన్ని కూర్చి ఆ విధంగా వచ్చిన మొత్తం రూ.10వేలును హెచ్ఎం నాగేశ్వరరావు చేతుల మీదుగా గురువారం అందించారు. అలాగే ఆ స్కూల్ ఇంగ్లిష్ టీచర్ అలమండ శ్రీను రూ.5వేలను సహాయంగా అందించారు.


బాధితుడు శ్రీనివాసరావుకు సహాయమందిస్తున్న దృశ్యం

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి : మేయర్


కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: కారుణ్య నియామకాల్లో ఉద్యోగం పొందిన ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ.. జీవీఎంసీ ఉన్నతికి కృషి చేయాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచించారు. ఇటీవల మరణించిన ఉద్యోగుల వారసులకు గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీలో పనిచేస్తూ.. వివిధ ఆరోగ్య సమస్యలతో అకాల మరణం పొందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఇద్దరు వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు, ఒక మజ్దూరు, ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశామన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- అరబిందో ఫార్మా సౌజన్యంతో నిర్మించిన సామాజిక భవనానికి ప్రారంభోత్సవం


తాళ్లపాలెంలో బహుళ ప్రయోజన సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : కోట్లాది రూపాయలు సీఎస్ఆర్ నిధులు వెచ్చించి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభివృద్ధికి దోహదపడుతుండడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో రూ.50 లక్షలు వెచ్చించి అందంగా నిర్మించిన మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు బహుళ ప్రయోజన సామాజిక భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ భాగస్వామ్యం అయి సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. సీఎస్ఆర్ నిధుల నుంచి నియోజక వర్గంలోని తాళ్లపాలెంలో రూ.50 లక్షలు, కశింకోటలో రూ.80 లక్షలు, తుమ్మపాల, సీతానగరంలలో సామాజిక భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చిందన్నారు. ఇప్పటికే తాళ్లపాలెం పూర్తి కావడంతో ప్రారంభించామన్నారు. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఉగ్గినపాలెంలో కూడా అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని పూర్తి చేయడానికి ఆ సంస్థ ముందుకు వచ్చిందని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. నియోజక వర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు రూ.2 కోట్లు ఖర్చు చేసి 2500 మందికి ఉచితంగా సైకిళ్లను కూడా అందించారన్నారు. పలు సేవలందిస్తున్న ఫార్మా ఫౌండేషన్‌కు ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన సహకారం అందించడానికి కృషి చేస్తానన్నారు. అరబిందో ఫార్మా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్లు గోపాలకృష్ణారెడ్డి, కమలాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, ఇందల హేమలత, అద్దంకి సతీష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో జీసీసీ స్టాళ్లు

- సీలేరు ,చింతపల్లిలో సూపర్ మార్కెట్ల ఏర్పాటు
- కాఫీ ధర కిలోకు రూ.10 పెంపు
- గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ దేవరాజు

సీలేరు: మన్యం పర్యాటక ప్రాంతాలకు దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులకు మన్యంలో దొరికే వస్తువులను విక్రయించేందుకు పర్యాటక ప్రదేశాల్లో జీసీసీ స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు చింతపల్లి డివిజనల్ మేనేజర్ దేవరాజు వెల్లడించారు. గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన జీసీసీ రేషన్ డిపో, పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు ధారాలమ్మ ఆలయం, లంబసింగి, కొత్తపల్లి జలపాతం తదితర ప్రాంతాల్లో స్టాళ్లను అందుబాటులోకి తెస్తామన్నారు. సీలేరు, చింతపల్లిలో సూపర్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ఏడాది కాఫీ గింజల కొనుగోలు ధర రూ. 10 పెంచామని చెప్పారు. ఈ ఏడాది కాఫీ గింజల కొనుగోలు ధరకు అదనంగా రూ.10 పెంచామని చెప్పారు. ఈ ఏడాది చింతపల్లి డివిజన్‌లో వెయ్యి మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. మన్యంలో తొలిసారిగా డౌనూరులో కాఫీ తయారీ కేంద్రం యూనిట్‌ను రూ.4 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. కాఫీ రైతులకు ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఒకొక్క రైతుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ మల్లేశ్వరరావు ఉన్నారు.


గూడెం కొత్తవీధిలో రికార్డులను పరిశీలిస్తున్న డివిజనల్ మేనేజర్ గణేష్


సీలేరులో పెట్రోల్ బంకు సిబ్బందితో మాట్లాడుతున్న మేనేజర్ దేవరాజు

జీసీసీ కార్యాలయం, గొడౌన్ల తనిఖీ

గూడెంకొత్తవీధి: స్థానిక జీసీసీ బీఎం కార్యాలయం, గొడౌన్లను పౌరసరఫరాల శాఖ డివిజనల్ మేనేజర్ శ్యామ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు.

రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరఫరాలో ఎలాంటి జాప్యం జరిగినా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సకాలంలో రేషన్ సరకులను డిపోలకు చేరవేయాలని గొడౌన్ ఇన్‌చార్జి కృష్ణారావును ఆదేశించారు. జాప్యం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.ఏఎం అకౌంటెంట్ సాయి, జీసీసీ బీఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మన్యంలో చలిగాలులు


పాడేరులో కురుస్తున్న పొగమంచు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- అర్ధరాత్రి నుంచి దట్టంగా పొగమంచు
- 16 నుంచి 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు

సాక్షి, పాడేరు: శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో మన్యంలో వాతావరణ మార్పులు ఏర్పడుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. పాడేరు మండలం మినుములూరులోని కేంద్ర కాఫీబోర్డులో గురువారం 16డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి తొమ్మిది గంటల తరువాత చలిగాలులు అధికంగా ఉంటున్నాయి. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. పాడేరు,అరకులోయ,చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు తీవ్రత నెలకొంటుంది. హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సొంతం

అనకాపల్లిటౌన్ : భవిష్యత్‌ను మార్చగల శక్తి క్రీడలకు ఉందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో గురువారం విశాఖ ఉమ్మడి జిల్లాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 కేటగిరీలకు జరిగిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కోటా ద్వారా ఉద్యోగాలు లభించినప్పుడు క్రీడలు భవిష్యత్‌ను మార్చి వేస్తాయన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరదారుఢ్యానికి ఉపకరిస్తాయన్నారు. అంతకుముందు పై క్రీడామైదానంతో పాటు రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో బాలబాలికల అండర్ -14, 17 చెస్, క్రికెట్ జట్ల ఎంపిక జరిగింది. ఎంపికైన జట్లను డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు.


పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు ద్వారపురెడ్డి బాపూజీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు అప్పలరాజు, కె.ఎం.నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు మనోహర్, ఎస్.వి.నరసింహం, దాడి శ్యాంప్రసాద్, ఎస్.శ్రీనివాస్, ఎం.శివనారాయణ, పి.వి.నాయుడు, ఎం.లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతోష్ ట్రోఫీకి చిట్టివలస క్రీడాకారుడు ఎంపిక

తగరపువలస: మహారాష్ట్రలో జరుగుతున్న 77వ నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (సంతోష్ ట్రోఫీ)కి చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారుడు తాటిపూడి కిరణ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ టీమ్ తరఫున కిరణ్‌కుమార్ పాల్గొంటున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, సభ్యులు జామి అప్పలకృష్ణ, పందిరి శ్రీనివాసరావు, మందిన రాంజీ, శౌంత్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, కంఠిమహంతి మహేష్, చిన్నారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


తాటిపూడి కిరణ్‌కుమార్

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని పాపయ్యసంతపాలెం గ్రామంలో ఎంపీఈఎల్ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.నరసింహరావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల ఆరోగ్యకేంద్ర పరిధిలో గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని, కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జెట్టపురెడ్డితుని గ్రామంలో..

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు శిబిరానికి హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన రక్త పరీక్షలు, ఈసీజీ జరిపించి, ఉచితంగా మందులు అందిస్తారన్నారు. జెట్టపురెడ్డితుని సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయదశమి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



విజయదశమి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: పట్టణంలో ఈ నెల 15 నుంచి 25 వరకు శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే విజయదశమి నవరాత్రి ఉత్సవాలకు పూర్తి సహకారం అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. గురువారం శివశక్తి సభ్యులతో కలిసి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పీలా రాముడు, కాండ్రేగుల అప్పలనాయుడు, పెంటకోట సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మద్దాల భీమేష్, పి.వరప్రసాద్, బుద్ధ జగన్ పాల్గొన్నారు.

15న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లిటౌన్: గవరపాలెం జగన్నాథస్వామి దేవాలయం ఆవరణలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 8 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పర్యావరణ పరిరక్షణ, గ్రీన్‌క్లబ్ సభ్యులు హాజరు కావాలని కోరారు. వాతావరణంలో మార్పులు సరిచేయాలంటే మొక్కలను నాటి, వాటి పర్యవేక్షణ కూడా చూడాలన్నారు. భావితరాల భవిష్యత్‌కు ప్రతి ఇంటి వద్ద మొక్కల్ని పెంచాలని పిలుపునిచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 816 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,280	4,480
రెండో రకం	3,060	4,200
మూడోరకం	3,850	4,050

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–23 యూనిట్లు, బీ పాజిటివ్–18 యూనిట్లు, ఓ పాజిటివ్–19 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

జగనన్న ఆరోగ్య సురక్షతో..

ప్రజల చెంతకే వైద్యం

- అరుంధతీనగర్, వెదురుపర్తి వైద్య శిబిరాలకు విశేష స్పందన
- శిబిరాలను సందర్శించిన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు పోటెత్తుతున్నారు. గ్రామ పరిధిలో జరుగుతున్నప్పటికీ సమీప గ్రామాల ప్రజలు కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని మరీ వైద్య సేవలు పొందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రులకు వెళ్లినా.. పారాసిటమాల్ మాత్రలు కూడా దొరికే పరిస్థితి ఉండేది కాదని, ఇపుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులన్నీ ఉచితంగానే అందిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్షలో రోగికి మందులు అందిస్తున్న దాడి రత్నాకర్



అరుంధతీనగర్ వైద్య శిబిరంలో ఎంపీ సత్యవతి, బొడ్డేడ లక్ష్మీనరసింహారావు



వైద్యుల సేవలను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రోగితో మాట్లాడుతున్న వైద్యులు



గర్భిణికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వైద్య సేవల కోసం క్యూలో నిరీక్షిస్తున్న రోగులు

అనకాపల్లిటౌన్: దేశంలో తొలిసారిగా పేద ప్రజల వద్దకు వైద్యుడు వెళ్లి, వైద్య సేవలందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, కంటి పరీక్షలు, ఈసీజీ, రక్తపరీక్షలు, రోగి వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు డబ్బులేదన్న కారణంగా వైద్యం చేయించుకోలేని పరిస్థితి లేకుండా, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందుతున్నారంటే ఆ ఘనత నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌దేనన్నారు. ప్రస్తుతం గ్రామాలకు కూడా ఆధునిక వైద్య సేవలు అందుతున్నాయంటే దానికి ఆ మహానేత తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనే కారణమని కొనియాడారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ వైద్యశిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని తొలి దశలోనే వ్యాధిని గుర్తించి, చికిత్స అందిస్తే, ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వైద్యం కోసం పెద్ద ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా నేరుగా గ్రామాల్లోనే వైద్య సేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. జోనల్ కమిషనర్ సూర వెంకటరమణ మాట్లాడుతూ వైద్యశిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కె.ప్రభావతి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర, వైద్యులు, యూపీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీ సత్యవతి

అనకాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బీవీ సత్యవతి కోరారు. అరుంధతీనగర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గురువారం సాయంత్రం ఆమె సందర్శించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. ఇటువంటి వైద్యాన్ని ప్రజల వద్దకు తీసుకొస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి, మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణకు సీఎం జగన్ ఎంతగా ప్రాధాన్యత ఇస్తున్నారో జగనన్న ఆరోగ్య సురక్ష అమలుతో తెలుస్తోందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ లేకుండా ఇలాంటి కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమం ఇంతగా జరిగేవి కావన్నారు. ప్రతిపక్షాలకు ఇవేవీ కానరాకపోవడం దురదృష్టకరమన్నారు. ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని ప్రభుత్వం మీ ముంగిటకే తీసుకొచ్చిందని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఎంపీ వెంట జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు ఉన్నారు.

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని వెదురుపర్తి సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను, వైద్య సేవలను పరిశీలించి వైద్య, ఆరోగ్య సిబ్బందికి మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ శిబిరాలకు ప్రతి చోట విశేష ప్రజాదరణ లభిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేచోట ప్రత్యేక వైద్య నిపుణులు, ఇతర డాక్టర్లతో వైద్య సేవలు, ఖరీదైన వివిధ రకాల రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందుల్ని ఉచితంగా అందించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శిబిరానికి వస్తున్న ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన వారిని ఉన్నత వైద్యానికి సిఫార్స్ చేయాలన్నారు.

మంత్రి పర్యవేక్షణలో చిన్నారికి కంటి పరీక్షలు

కంటి వైద్య శిబిరానికి తల్లితోపాటు వచ్చిన చిన్నారి పల్లా జశ్వంత్‌కు మంత్రి దగ్గరుండి మరీ కంటి పరీక్షలు జరిపించారు. ఈ సందర్భంగా గోడపై ఉన్న ఆంగ్ల అక్షరాలు చదివించి దృష్టి లోపాన్ని ఆప్తాలమిక్ అధికారి గుర్తించారు. ఇదంతా అయ్యే వరకు మంత్రి అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్వయంగా రుచి చూశారు. ఆరోగ్యశ్రీ కార్యక్రమం అమలు తీరుపై సిబ్బందితో సమీక్షించారు. 104 వాహనంలో ఈసీజీ పరీక్షలు, శిబిరానికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్షలు, మందుల పంపిణీని క్షుణ్ణంగా పరిశీలించారు. శిబిరంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, వైద్యులు ఎస్.తిరుపతిరావు, యు.రమేష్, మనీషా, యశోద, సర్పంచ్ శనివాడ నాగమణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లవరపు నాగు, పార్టీ మండల కార్యదర్శి ఆళ్ల జగదీష్, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

545 మందికి వైద్య సేవలు

మండలంలోని మారుమూలన ఉన్న వెదురుపర్తి సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష జనాదరణ లభించింది. ఇప్పటి వరకు జరిగిన 8 ఆరోగ్య శిబిరాల్లో ఇక్కడే అత్యధికంగా 565 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 54 మందిని ఉన్నత వైద్యానికి సిఫార్స్ చేశారు. 144 మంది కంటి రోగులకు వైద్య సేవలందించారు. వీరిలో 43 మందిని కేటరాక్టు ఆపరేషన్లకు, 69 మందిని కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు. ఉచితంగానే ఆయా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు గ్రేసీ కేథరిన్, కె.సునీల్, పీహెచ్‌సీ వైద్యులు రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. బీపీ, సుగర్, కేన్సర్, రక్తశాతం, మలేరియా, డెంగ్యూ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఆరుగురి నుంచి కఫం నమూనాలు సేకరించారు. 39 మందికి ఆరోగ్యశ్రీలో అభా కార్డులు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఓ దివ్యాంగుని ట్రైసైకిల్ వద్దకు పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతిరావు, సిబ్బంది వెళ్లి, సమస్య తెలుసుకుని, అవసరమైన చికిత్స అందించారు.



104 వాహనంలో ఈసీజీ పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వెదురుపర్తి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు



దివ్యాంగుని వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్న డా.తిరుపతిరావు



వెదురుపర్తిలో వైద్య సేవలు పొందడానికి వచ్చిన బాలికలు

చర్మంపై మచ్చలు, దద్దుర్లు



శరీరం, ముఖంపై నల్లని మచ్చలు, దద్దుర్లు వచ్చి దురద పెడుతున్నాయి. ఎంత మంది డాక్టర్ల దగ్గర మందులు వాడినా తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. మందులు కూడా ఇచ్చారు. ఇకనైనా ఈ బాధ తగ్గుతుందని ఆశ.

– ప్రగడ అప్పలనాయుడు, వెదురుపర్తి

తరచూ తలనొప్పి



తరచుగా విపరీతమైన తల నొప్పి వస్తోంది. చాలా వరకు తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్‌ను కలిశాను. ఏవేవో పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. వాటిని వాడిన తర్వాత కూడా తగ్గకపోతే పట్టణంలో ఆస్పత్రికి రావాల్సి ఉంటుందన్నారు.

– కంఠపురెడ్డి లక్ష్మి, వెదురుపర్తి

తెలుగు భాష పరిరక్షణకు కృషి



తెలుగు భాషా విశిష్టతపై మాట్లాడుతున్న రామ్మోహనరావు

తుమ్మపాల: ప్రాథమిక విద్యాభ్యాస దశలోనే తెలుగు భాషను ప్రతి విద్యార్థి నేర్చుకునేలా చేసి, తెలుగు ఔన్నత్యాన్ని కాపాడాలని తెలుగు పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొయిలాడ రామ్మోహనరావు కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలుగుకు వెలుగునిద్దాం కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడారు. హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలుగులో మానవ సంబంధాల్ని సూచించే అమ్మ, నాన్న, పిన్ని, చిన్నాన్న, మామయ్య, అత్త వంటి పదాలను కూడా అంకుల్, ఆంటీ వంటి పదాలను ఉపయోగించి, తెలుగును కనుమరుగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిష్టా తిమ్మరాజు తెలుగు పద్యాల సొగసును వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి, మాధవి సనారా, అమరజ్యోతి, ఎన్‌వీఎస్ మూర్తి, కె.శంకరరావు, ఎస్ఎస్ బాషా పాల్గొన్నారు.

దుర్గాదేవి పాదయాత్ర భక్తులకు ఆతిథ్యం



చింతలపాలెంలో దుర్గాదేవి భక్త బృందానికి స్వాగతం పలికిన గ్రామస్తులు, భవానీ భక్తులు

కశింకోట: దుర్గాదేవి భక్తుల బృందం పాదయాత్ర మండలంలోని చింతలపాలెం వద్దకు గురువారం చేరుకుంది. విశాఖ నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి నలుగురు యువకులు మాలధారులై పాదయాత్ర చేపట్టారు. వారి పాదయాత్ర చింతలపాలెం చేరడంతో నరసింగబిల్లి దుర్గాదేవి ఉత్సవ కమిటీ చైర్మన్, గురు భవాని జెర్రిపోతుల నూకినాయుడు స్వాగతం పలికి, ఆతిథ్యమిచ్చారు. సాయంత్రం అక్కడి వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించి పళ్లు, ఫలహారాలుతో బృందాన్ని సాగనంపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, స్థానిక భవానీ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి ప్రసాదం స్వీకరించారు. సర్పంచ్ పడాల వెంకట రమణతో పాటు గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం జాతీయ రహదారి విస్తరణలో తొలగించడంతో కొత్తగా పునర్నిర్మించామన్నారు. మాజీ ఉప సర్పంచ్ కాపుశెట్టి వెంకట్ ఆధ్వర్యంలో జైశ్రీరామ్ కమిటీ ఏర్పాటు చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వనం అచ్చెంనాయుడు, పడాల బాను తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ: సంపూర్ణ ఆరోగ్యం కోసం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం పి.కనకేశ్వరరావు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మేజిక్ బస్ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులను శుభ్రం చేసుకోవడానికి ఏడు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మేజిక్ బస్ ఏఈ గాయత్రి, ఎల్.ఎస్.ఈ.శ్యామల, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోహంలో నేత్రపర్వంగా పూర్ణాహుతి



పూర్ణాహుతిలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడి సోహం ఆశ్రమంలో గురువారం పూర్ణాహుతి కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు రవి మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోరుతూ జూలై 14 నుంచి చేపట్టిన 90 రోజుల మహా మృత్యుంజయ హోమం బుధవారం వరకు కొనసాగిందన్నారు. స్థానిక గ్రామస్తులతోపాటు, పరిసర గ్రామ ప్రజలు, ఆధ్యాత్మిక సంస్థలు ఈ అఖండ హోమానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. పూర్ణాహుతి కార్యక్రమంతో హోమం నిర్విఘ్నంగా పరిసమాప్తి అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి, టమాటా ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లిపాయ ధర స్వల్పంగా పెరిగింది. గత వారం కిలో రూ.30 ఉండగా ఈ వారం రూ.35కు చేరుకుంది. ఇక టమాటా కిలో రూ.20 నుంచి 25కు పెరిగింది. ఎప్పటిలాగే బంగాళాదుంప రూ.30, కేరట్, బీట్రూట్, దొండకాయ, వంకాయ రూ.40, బెండకాయ, బీరకాయ రూ.60, పాదు చిక్కుడు, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ఘనంగా సత్తెమ్మతల్లి ఊరేగింపు



సత్తెమ్మతల్లి ఊరేగింపు ఉత్సవంలో గ్రామస్తులు

కశింకోట: కశింకోటలో సత్తెమ్మతల్లి అమ్మవారి ఊరేగింపు ఉత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక కస్పావీధి నుంచి భజనలు, తోడ పెద్దు సేవలతో బయలుదేరిన అమ్మవారి ఊరేగింపు పెద్ద బజారు, గవరపేట, కనకమహాలక్ష్మి వీధుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం పిసినికాడ వద్దనున్న ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. అక్కడ అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

సరైన చికిత్సతో ఆర్థరైటిస్ నివారణ



అవగాహన ర్యాలీలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక శక్తిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు అన్నారు. స్థానిక సత్యదేవ్ ఆస్పత్రిలో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి క్షీణించడం వల్ల సంభవించే వ్యాధుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందన్నారు. దీని వల్ల వచ్చే కీళ్లవాత సమస్యలపై ప్రజలు చాలా వరకు ఏ వైద్యుల్ని సంప్రదించాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. వందలో ఒకరిద్దరు మాత్రమే రుమటాలజిస్ట్‌ల వద్దకు వెళ్తున్నారని, మిగిలిన వారంతా నొప్పుల నివారణకు మందులు వాడటంతో మరిన్ని వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్ వల్ల ఊపిరితిత్తులు, కిడ్నీలు, కళ్లు, మెదడువాపు, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయన్నారు. స్టెరాయిడ్ అవసరం తగ్గించి ఇతర మందులతో వైద్యం చేయించుకుంటే ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావన్నారు. అంతకుముందు ఆస్పత్రి నుంచి నెహ్రూచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, లావణ్య, ఆళ్ల వసంత్‌కుమార్, సురేష్‌కుమార్ సుండ్రు, ఫార్మసిస్ట్‌లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఉత్సవం



దుర్గాదేవి ఆలయంలో పూజలు

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు గూడెపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని దీక్ష



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మోహనరావు

అనకాపల్లిటౌన్: ల్యాండ్‌పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ పట్టాలను తక్షణమే ఇవ్వాలని ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో వీఎంఆర్‌డీఏ లే అవుట్‌లో ల్యాండ్‌పూలింగ్ బాధిత రైతులు సంఘం ఆధ్వర్యంలో గురువారం జగనన్నకాలనీ పనులను అడ్డగించి పోరాట దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.